సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



ఫోర్జరీ సంతకాలతో ష్యూరిటీ

ఫోర్జరీ సంతకాలతో ష్యూరిటీ పత్రాలను తయారు చేసి వివిధ న్యాయస్థానాల్లో నిందితులు బెయిల్‌పై రావడానికి సహకరిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేశారు. -8లో



విద్యార్థులకు వార్షిక పరీక్షలు

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలోని 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 12నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. -8లో

గరిష్టం/కనిష్టం
$39^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

కోవిడ్‌పై మాక్‌డ్రిల్



ఎంజీఎం: కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎంజీఎంలో కరోనా చికిత్సలు అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలనే ఆదేశాల మేరకు ఎంజీఎం పరిపాలనాధికారులు ముందుకు కదిలారు. కోవిడ్ చికిత్స అందించే ప్రొటోకాల్‌పై సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కోవిడ్ లక్షణాలతో ఎవరైనా ఆస్పత్రికి వస్తే బాధితుల వివరాల నమోదు, నమూనాల సేకరణ ప్రక్రియ, రికార్డుల నమోదు, బెడ్ కేటాయింపు, వైద్య సేవలు అందించాల్సిన తీరు, ఆక్సిజన్ వినియోగం, ఐసోలేషన్ పూర్తయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగికి కోవిడ్ లక్షణాలు కానరాకుండానే.. మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

పింగిళి కళాశాలలో 59.61 శాతం ఉత్తీర్ణత



విద్యారణ్యపురి: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాల్ని సోమవారం ఆ కళాశాలలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి, విడుదల చేశారు. మొత్తం 463 మంది పరీక్షలకు హాజరవగా.. 276 మంది(59.61 శాతం) మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల విడుదలలో పింగిళి కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు రేణుక, శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అకాడమిక్ కో-ఆర్డినేటర్ పార్వతి, వివిధ విభాగాల అధిపతులు రాజేశ్వరి, గంప రజిత, మాధవి, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థి వికాసం జరగాలి



కేయూ క్యాంపస్: విద్యార్థి వికాసం జరగాలని, సమస్యలకు పరిష్కారం వెతకాలని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. సోమవారం కేయూలోని విద్యా కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన వర్సిటీ పరిధి బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అడ్మినిస్ట్రేషన్ పరంగా ఉన్న సమస్యల్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థ బలహీన పడకూడదన్నారు. విద్యా విభాగం డీన్, అడ్జంట్ ఆచార్యులు రాంనాథ్‌కిషన్ మాట్లాడుతూ.. మారుతున్న పాఠ్యప్రణాళికకు అనుగుణంగా విద్యాబోధన ఉండాలని కోరారు. కేయూ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈసమావేశంలో బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నేడు కేయూలో పూలే జయంతి వేడుకలు

కేయూ క్యాంపస్: కేయూలోని బీసీ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కేయూ బీసీ సెల్ డైరెక్టర్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు సోషల్ సైన్స్ డీన్ విజయబాబు పాల్గొంటారని తెలిపారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

రైలుబండి.. కిక్కిరిసెనండి!

- రైళ్లలో జనరల్ బోగీల తగ్గింపుతో ప్రయాణికుల అవస్థలు
- హాల్టింగ్‌లను సైతం ఎత్తేసిన వైనం
- గతంలో నాలుగు బోగీలుండగా కరోనా తరువాత కట్
- ఒక్కో సర్వీసులో రెండు, కొన్నింటిలో ఒకటే జనరల్ బోగీ
- ఒక్కో బోగీలో 150 మంది వరకు ప్రయాణం
- ఉమ్మడి జిల్లాలో రోజువారీ ప్రయాణికుల అవస్థలు ఎన్నెన్నో..

వరంగల్ డెస్క్:

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు విజయవాడ-సికింద్రాబాద్ మార్గాల్లో నడిచే రైళ్లలో ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ వర్గాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. కరోనాకు ముందు అన్ని రైళ్లకు రిజర్వేషన్ బోగీలతోపాటు జనరల్ బోగీలు కూడా ఎక్కువగానే ఉండేవి. దీంతో ప్రయాణం కూడా సౌకర్యవంతంగా ఉండేది. కూర్చుకోవడానికి సీట్లు కూడా దొరికేవి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైలుమార్గం ఉన్న స్టేషన్లలో హాల్టింగ్ ఉండడంతో ప్రయాణికులు నిరంతరం రాకపోకలు సాగించేవారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో రైళ్లన్నీ రద్దు చేయడంతో రైల్వే ఆదాయానికి రూ.కోట్లలో గండిపడింది. కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత ఒక్కో రైలును పట్టాలెక్కించారు. ముందుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రాధాన్యం ఇచ్చిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు తర్వాత పుష్‌పుల్, ప్యాసింజర్ రైళ్లను నడిపిస్తున్నారు. మరికొన్నింటిని పూర్తిగా రద్దు చేశారు. కాజీపేట-విజయవాడ ప్యాసింజర్, భద్రాచలం రోడ్-కాజీపేట మణుగూరు ప్యాసింజర్‌ను ఇంతవరకు నడిపించడం లేదు. ఈ రైళ్లు పేదలకు అందుబాటులో ఉండటం .. సమయానికి నడవడంతో ప్రయాణికులు ఎక్కువగా వినియోగించుకున్నారు. ప్రస్తుతం వాటి ఊసే లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ప్రజల నుంచి డిమాండ్ వస్తున్నా.. రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

హాల్టింగ్ లేని ఎక్స్‌ప్రెస్‌లు..

ఎక్కువగా ఆదాయం లేని రైల్వేస్టేషన్లను పట్టించుకునే వారు కరువయ్యారు. ప్యాసింజర్లు రద్దు చేసిన క్రమంలో అక్కడ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించడం లేదు. పై ప్యాసింజర్లు ఉన్నప్పుడు వీరి ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు ఎదురయ్యేవి కాదు. వాటిని రద్దు చేసిన తర్వాత చిన్న స్టేషన్లలో రైళ్లు ఆగక ఆయా స్టేషన్లన్నీ బోసిపోతున్నాయి. మరోమార్గం లేక ప్రజలు బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. వీటికి ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తుండడంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది.



ఈ ఫొటో చూడండి. మచిలీపట్నం నుంచి బీదర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులోని జనరల్ బోగీ. ఈ రైలుకు ముందు ఒకటి, వెనుక ఒకటే జనరల్ బోగీ ఇచ్చారు. గతంలో రెండు చొప్పన ఉండేవి. కరోనా తరువాత తగ్గించేశారు. రైలు బోగీలో ప్రయాణికుల సామర్థ్యం 80మంది. కానీ 150మంది వరకు ప్రయాణిస్తున్నారు. బాత్రూమ్ దగ్గర సైతం కిక్కిరిసి కూర్చున్నారు. బ్యాగులు పెట్టుకునే దగ్గరా ప్రయాణికులే. కొందరు వేలాడుతూ.. మరికొందరు కింద కూర్చుని ప్రయాణించాల్సిన పరిస్థితి.



వరంగల్‌లో గోల్కొండ రైలు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

శాలిమార్ నుంచి హైదరాబాద్ వెళ్లే హౌరా, సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళ్లే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ముందు ఒకటి, వెనుక ఒక జనరల్ బోగీలు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పండుగల ముందు ప్రయాణం చేయాలంటే నరకం అనుభవించాల్సిందే. బాత్‌రూమ్ డోర్లు తీసి వాటిలోనూ కూర్చోవాల్సిన పరిస్థితి. మహిళా ప్రయాణికులు అత్యవసరానికి వెళ్లాలంటే ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉన్న రైళ్లకు ఒకటో, రెండో జనరల్ బోగీలు

ప్రస్తుతం నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు హౌరా, మచిలీపట్నం, సింహపురి, పద్మావతి, చార్మినార్, గౌతమి, షిరిడీ రైళ్లకు ముందు, వెనుక ఒక్కో జనరల్ బోగీ మాత్రమే వేస్తున్నారు. కొన్నింటికి ఒకటే బోగీ ఇస్తున్నారు. సాధారణ రోజుల్లో, పండుగ సీజన్, ప్రత్యేక రోజుల్లోనూ ఇలాగే.. బోగీలు ఉండడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. రెండు మూడు బోగీల ప్రయాణికులు ఒకే బోగీలో ఎక్కడంతో ఊపిరి ఆడని పరిస్థితి. టాయ్‌లెట్లలో కూర్చొని ప్రయాణించడంతో మహిళలు 'అత్యవసరానికి' వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. జనరల్ టికెట్ తీసుకుని రిజర్వేషన్ బోగీలో ఎక్కితే టీటీఈలు జరిమానా విధిస్తూ జేబులకు చిల్లు పెడుతున్నారు. గతంలో ప్రవేశపెట్టిన రైలుకు గరీబ్ రథ్ అని పేరు పెట్టినా.. ఇందులో అన్నీ ఏసీ బోగీలే. ఇందులో సాధారణ ప్రజలకు టికెట్ తీసుకుని ఎక్కేందుకు వీలుండదు.

కరోనా తర్వాత కనుమరుగు



- కాజీపేట-విజయవాడ ప్యాసింజర్. ఇది తెల్లవారుజామున 4 గంటలకు కాజీపేట నుంచి విజయవాడకు బయలుదేరుతుంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్టేషన్లలో ఆగుతుంది. దాదాపు 9.30 గంటల వరకు విజయవాడకు చేరుకుంటుంది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులతోపాటు డోర్నకల్ ప్రాంతం నుంచి ఎక్కువగా కూలీలు ఖమ్మంకు వెళ్తుంటారు. వారి కూలీ పనులకు అనుకూలంగా ఉంటుంది. దీన్ని కరోనా తర్వాత రద్దు చేశారు. మళ్లీ పునరుద్ధరించలేదు.
- భద్రాచలం రోడ్-కాజీపేట ప్యాసింజర్. ఇది కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో ఉదయం 8 గంటలకు బయల్దేరి డోర్నకల్ మీదుగా కాజీపేటకు మధ్యాహ్నం 12 గంటల వరకు చేరుకుంటుంది. మళ్లీ కాజీపేట నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 7 గంటలకు కొత్తగూడెం స్టేషన్‌కు చేరుకుంటుంది. ఇది చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే రైలు. దీనిని కూడా కరోనా తర్వాత రద్దు చేశారు. తిరిగి పునరుద్ధరించలేదు.
- మహారాష్ట్రలోని కొల్హాపూర్-వరంగల్-మణుగూరు ఎక్స్‌ప్రెస్‌ను కరోనా తర్వాత రద్దు చేశారు. దీనిని ఇంతవరకు పునరుద్ధరించలేదు.
- డోర్నకల్-కొత్తగూడెం రోడ్‌లో ఉదయం, సాయంత్రం నడిచే ప్యాసింజర్‌ను కరోనా తర్వాత రద్దు చేసి మళ్లీ నడిపించడం లేదు.
- పెద్దపల్లి నుంచి విజయవాడ వరకు వారానికి రెండుసార్లు ఉండే మెమూ ప్యాసింజర్‌ను రద్దు చేశారు. రద్దు చేసిన రైళ్లను తిరిగి నడిపిస్తే సాధారణ ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.

జనరల్ బోగీలు పెంచాలి



నేను 12 ఏళ్లుగా వరంగల్ నుంచి అప్ అండ్ డౌన్ చేస్తున్నా. కరోనా సమయం నుంచి చాలా వరకు రైళ్లలో జనరల్ బోగీలు తగ్గించడం వల్ల ప్రయాణం ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రతి రైలుకు ముందు, వెనుక ఒకటే జనరల్ బోగీ ఉండడంవల్ల అది కూడా మొత్తం ప్రయాణికులతో నిండి ఉంటుంది. రైలు వచ్చి కదిలేలోగా ఎక్కలేకపోతున్నాం. అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జనరల్ బోగీలను పెంచాలి.

- ఎ.వేణుగోపాల్, అకౌంటెంట్, జిల్లా ట్రెజరీ కార్యాలయం, మహబూబాబాద్

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



రైళ్లలో జనరల్ బోగీలు తగ్గించే సరికి చాలా మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేను రోజూ వరంగల్ నుంచి మహబూబాబాద్‌కు ఉద్యోగరీత్యా రాకపోకలు సాగిస్తుంటా. ఈక్రమంలో కోవిడ్ అనంతరం రైల్వేశాఖ రైళ్లను తగ్గించడంతోపాటు ఉన్న వాటిలో జనరల్ బోగీలు తగ్గించారు. మాలాంటి వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

- వెంకటాచలం టీచర్, వరంగల్

ఉమ్మడి జిల్లాలో ప్రధాన స్టేషన్లు.. జనరల్ బోగీల్లో ప్రయాణికులు ఇలా.. (అంచనా)

వరంగల్	కాజీపేట జంక్షన్
4,500	5,000
మహబూబాబాద్	జనగామ
4,000	3,000

కాజీపేట జంక్షన్ నుంచి అప్ అండ్ డౌన్ నడిచే రైళ్లు 120 వరకు

రాష్ట్రం ఆ స్థలం అప్పగించలేదు

- ఓ ఆర్టీఐ దరఖాస్తుకు ఏఏఐ సమాధానం
- మామునూరు విమానాశ్రయం కథ మామూలేనా..?



సాక్షి, వరంగల్: వరంగల్‌కు విమాన రాకపోకలు ఇంకా చాలా దూరంలో ఉన్నాయా? అదిగో, ఇదిగో అంటూ ఏళ్లుగా వింటున్న మాటలు ఇంకా మాటలుగానే ఉన్నాయా... అంటే అవుననే అనిపిస్తోంది. విమానాశ్రయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రెండు దశల్లో సేకరించి ఇద్దామన్న 443.86 ఎకరాలు ఇంకా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు బదిలీ చేయలేదని ఓ ఆర్టీఐ దరఖాస్తుదారుడికి కేంద్రం తాజాగా సమాధానం ఇచ్చింది. చిన్న నగరాలను రాష్ట్ర రాజధానులు, దేశ రాజధానులతో కలిపేందుకు కేంద్రం 2016లో ఉడాన్ (ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్) పథకం కింద మామునూరు విమానాశ్రయాన్ని గతేడాది సెప్టెంబర్‌లో ఎంపిక చేసింది. ఈ విమానాశ్రయ అభివృద్ధికి రాష్ట్రం నుంచి సహకారం లేకపోవడంతో పురోగతి లేదని తెలిసింది. రివైజ్డ్ మాస్టర్‌ప్లాన్ ఇస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా ఇప్పటికీ ఆచరణ రూపంలోకి తీసుకురాకపోవడంతో విమానాశ్రయం గగనమేనన్న చర్చ ఉంది.

ఏం సమాధానం ఇచ్చారంటే..

ఎయిర్‌పోర్ట్ కోసం 737.2 ఎకరాలు ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. విమానాశ్రయ అభివృద్ధి కోసం ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ప్రకారం ఫేస్-1 కింద 179.41 ఎకరాలు, ఫేస్-2 కింద 264.45 ఎకరాలు భూమి సేకరించి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికీ ఆ భూమిని ఏఏఐ పేరు మీదకు బదిలీ చేయలేదని ఓఆర్టీఐ దరఖాస్తుదారుడికి ఇచ్చిన సమాధానంలో ఏఏఐ పేర్కొంది. ఈసమాధానంతో విమానాశ్రయ ఏర్పాటుకు ఇంకా సమయం పట్టేలా కనిపిస్తోంది. విమానంలో విహరిద్దామనుకున్న జిల్లావాసుల కలలు మరింత ఆలస్యమయ్యేలా ఉన్నాయి.

సౌత్ ఏషియా రీజినల్ కాన్ఫరెన్స్‌కు మేయర్

వరంగల్ అర్బన్: నేపాల్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు సౌత్ ఏషియా రీజనల్ కాన్ఫరెన్స్‌కు మేయర్ గుండు సుధారాణి హాజరుకానున్నారు. ఖట్మాండులో ఈనెల 11 నుంచి 13 వరకు జరగనున్న కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొననున్నారు. ఈమేరకు సోమవారం సాయంత్రం మేయర్ బయల్దేరి వెళ్లారు. యునైటెడ్ సిటీస్, స్థానిక ప్రభుత్వాలు ఆసియా పసిఫిక్ (యూసీఎల్‌జీ ఎఎస్‌పీఏసీ), మున్సిపల్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ (ఎంయూఏఎన్), ఖాట్మండు మెట్రోపాలిటన్ సిటీ, లలిత్‌పూర్ మెట్రోపాలిటన్ సిటీ, ధులిఖేల్ మున్సిపాలిటీ సంయుక్తంగా కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో దక్షిణాసియా ప్రాంతీయ సహకార మండలికి చెందిన (ఎస్‌ఏఏఆర్‌కే) 7 దేశాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారు. మేయర్ సుధారాణి నగరంలో బల్దియా అవలంబిస్తున్న ఉత్తమ శానిటేషన్ విధానాల మీద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తారని బల్దియా అధికారులు వెల్లడించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

హన్మకొండ చౌరస్తా: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. పరీక్ష పేపర్ లీకేజీలతో పిల్లల భవిష్యత్‌ను నాశనం చేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు హాజరు కావాలని యువత, మేధావులు, విద్యావంతులకు పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. అనంతరం, హనుమకొండలోని సెంట్రల్ లైబ్రరీని కోదండరాం సందర్శించి పోటీ పరీక్షల అభ్యర్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నాయకులు గోవర్దన్, నున్నా అప్పారావు, నమిండ్ల శ్రీనివాస్, బొమ్మతి విక్రమ్, మంద శంకరయ్య, నాగేశ్వర్‌రావు, మండల వెంకన్న, డాక్టర్ విజయ్, నరసింహారావు, శ్రీనివాస్, కన్నం సునీల్, మంద శ్యాం జగపతిరావు, మొగిలి ప్రతాప్, రంజిత్‌కుమార్, వేణుగోపాల్, పి.చంద్రన్న, మహేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయండి

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్

హన్మకొండ: బీజేపీ ఆధ్వర్యంలో హనుమకొండలో ఈనెల 15న నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిరుద్యోగ మార్చ్ నిర్వహణ కమిటీ చైర్మన్ ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. సోమవారం రాత్రి హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో నిరుద్యోగ మార్చ్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయిలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై మిలియన్ మార్చ్ తరహాలో నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర జిల్లా నాయకులు డాక్టర్ గుండె విజయ రామారావు, మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఒంటేరు జైపాల్, మొలుగూరి భిక్షపతి, వన్నాల శ్రీరాములు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బంగారు శృతి, గంగిడి మనోహర్‌రెడ్డి, భరత్ గౌడ్, ఆకుల విజయ, వీరేందర్ గౌడ్, ఎల్లన్న, పుల్లా రావు యాదవ్, రాకేశ్‌రెడ్డి, కీర్తిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

టెన్త్ పరీక్షల్లో ఐదుగురు డీబార్

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో సోమవారం ధర్మసాగర్‌లోని బాలికల ఉన్నత పాఠశాల పరీక్షకేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడుతూ ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. సోమవారం నిర్వహించిన సైన్స్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 17 మంది గైర్హాజరయ్యారు. జిల్లా స్థాయి పరిశీలకురాలు విజయలక్ష్మి బాయి 5 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా.. అదనపు కలెక్టర్ సీహెచ్.సంధ్యారాణి 5, డీఈఓ ఎండి.అబ్దుల్‌హై 5, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు 23 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

సీఎస్, డీఓ విధులనుంచి తొలగింపు

ఐదుగురు డీబార్ అయిన నేపథ్యంలో ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఇ.సుమాదేవి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌లను ఆ పరీక్షల నిర్వహణ విధుల నుంచి విద్యాశాఖ అధికారి ఎండీ.అబ్దుల్‌హై తొలగించినట్లు డీఈఓ కార్యాలయ ఏసీజీ చలపతిరావు సోమవారం తెలిపారు. మళ్లీ ఆ పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా కట్రియాల పెల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా ధర్మసాగర్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌ను డీఈఓ నియమించినట్లు చలపతిరావు పేర్కొన్నారు.

వరంగల్ జిల్లాలో.. 19మంది గైర్హాజరు

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలో సోమవారం పదో తరగతి సామాన్యశాస్త్రం పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు. మొత్తం 9,728 మందికి గాను 9,709 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 19 మంది గైర్హాజయ్యారు. 20 పరీక్ష కేంద్రాలను వివిధ తనిఖీ బృందాలు తనిఖీ చేశాయి.

విన్నపాలు వినేదెవరు?

- నామమాత్రపు పరిష్కారాలే శరణ్యం
- గ్రేటర్ గ్రీవెన్స్‌కు తగ్గుతున్న ఫిర్యాదులు
- రెగ్యులర్ కమిషనర్ లేకపోవడమే ప్రధాన కారణం

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్‌కు రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో గ్రీవెన్స్‌లో వింగ్ అధికారులు స్వీకరిస్తున్న ఫిర్యాదులకు ప్రాధాన్యం తగ్గింది. ప్రతీవారం సుమారు 55 నుంచి 65 వరకు నమోదయ్యే వినతుల సంఖ్య గత రెండు వారాలుగా తగ్గింది. గత వారం 32 ఫిర్యాదులు రాగా.. ఈవారం 41కి చేరింది. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో వింగ్ అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా.. పరిష్కారం లభించట్లేదని అర్జీదారులు అధికారులతో మొరపెట్టుకున్నారు. గ్రీవెన్స్‌సెల్‌కు 41 ఫిర్యాదులు రాగా.. అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 21, పన్నుల విభాగానికి 3, ఇంజనీరింగ్ విభాగానికి 9, పబ్లిక్ హెల్త్ 4, వాటర్ సప్లయ్ 4 చొప్పున అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రవీందర్‌యాదవ్, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, జోనా, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీహెచ్ఓ శ్రీనివాసరావు, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్‌లింగం, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఎంహెచ్ఓ జ్ఞానేశ్వర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న వింగ్ అధికారులు

ఫిర్యాదుల్లో కొన్ని..

- మురికివాడల్లోని డ్రెయినేజీలు, ఖాళీ స్థలాల్లో పందులు సంచరిస్తున్నాయని, దుర్వాసన వస్తోందని, కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని నాగేశ్వరచారి వినతిపత్రం అందించారు.
- పోస్టల్ కాలనీ లేఔట్ డీపీ నంబరు 10/1984 నందు 40 ఫీట్ల రోడ్డును ఆక్రమించి గోడ నిర్మిస్తున్నారని చర్యలు తీసుకోవాలని కాలనీ రెసిడెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు.
- భీమారం బ్యాంక్ కాలనీలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని, నీటి సౌకర్యం కల్పించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీ ప్రతినిధులు విన్నవించారు.
- హనుమకొండలోని ఓ పాత థియేటర్ స్థలంలో తవ్విన మట్టిని, భద్రకాళి చెరువులో పోస్తున్నారని, దుమ్మూధూళితో ఇబ్బందులు పడుతున్నామని పద్మాక్షి కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- 3వ డివిజన్ కన్నమ్ముళ్ల గణపతి కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీ ఓనర్స్ వినతిత్రం అందజేశారు.
- మడికొండ లేఔట్ కాలనీ, అంబేడ్కర్‌నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, నూతనంగా నిర్మించాలని కాలనీవాసులు వినతి పత్రాన్ని అందించారు.
- హనుమకొండ ఏకశిల పార్కు 80 ఫీట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, గతంలో 5 సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం పట్ల కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు.
- దేశాయిపేట రోడ్డు సర్వేనంబరు 275 తప్పుడు పత్రాలు సృష్టించుకుని ఇంటి నంబర్లు పొందారని, చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.
- ఉర్సు హిందూ శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని దాసి రాందేవ్ విన్నవించారు.

భద్రత పెంపు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–విశాఖపట్నం వరకు ప్రయాణించే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఇటీవల జరిగిన రాళ్లదాడి నేపథ్యంలో రైల్వేపోలీస్ ఉన్నతాధికారుల ఆదేశానుసారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) భద్రత పెంచినట్లు కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు సోమవారం తెలిపారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ పరిధి సెక్షన్లలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తున్న సమయంలో పోలీసుల ప్రత్యేక నిఘా, భద్రతను పెంచినట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్ పరిధిలోని దర్గా రైల్వే లెవెల్‌క్రాసింగ్ గేట్, పెండ్యాల్, నష్కల్ రైల్వే గేట్ల వద్ద పోలీసుల భద్రత పెంచడంతో పాటు గేట్లలో నుంచి రాకపోకలు చేసే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన వారిపై రైల్వే చట్టం ప్రకారం కేసులు తీవ్రంగా ఉంటాయని ఆయన తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

వరంగల్ స్పోర్ట్స్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మే1 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు, శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్ కుమార్ సూచించారు. వివిధ క్రీడాంశాల్లో నెల రోజుల పాటు అందించే శిక్షణ కోసం ఈనెల 5 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. నాలుగో తరగతి నుంచి ఇంటర్ చదివే పట్టణ ప్రాంత విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఇతర పూర్తి వివరాలకు హనుమకొండ ఇండోర్ స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



విద్యార్థులకు వార్షిక పరీక్షలు

- పాఠశాలల్లో రేపటి నుంచి 20వ తేదీ వరకు
- ఎంఆర్‌సీలో ప్రశ్నపత్రాలు



విద్యారణ్యపురి: ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈనెల 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణపై టైంటేబుల్ షెడ్యూల్‌ను డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై, డీసీఈబీ సెక్రటరీ రాజన్న విడుదల చేశారు. 12న 1నుంచి 7వ తరగతుల విద్యార్థులకు ప్రథమ భాష (తెలుగు, ఉర్దూ తదితర) పరీక్షలు నిర్వహిస్తారు. 8, 9వ తరగతి విద్యార్థులకు గణితం పరీక్షలు నిర్వహిస్తారు. 13న 1 నుంచి 5 తరగతులకు ఇంగ్లీష్, 6, 7 తరగతులకు ద్వితీయ భాష (హిందీ ,తెలుగు), 8, 9 తరగతులకు భౌతిక శాస్త్రం, 15న 1 నుంచి 5 తరగతులకు గణితం, 6,7 తరగతులకు తృతీయ భాష(ఇంగ్లిష్), 8, 9 తరగతులకు సాంఘికశాస్త్రం, 17న 1 నుంచి 5 తరగతులకు పరిసరాల విజ్ఞానం 6, 7 తరగతులకు సాంఘీక శాస్త్రం, 8, 9 తరగతులకు ప్రథమ భాష (తెలుగు,ఉర్దూ), 19న 6,7 తరగతులకు గణితం, 8 ,9 తరగతులకు ద్వితీయ భాష (హిందీ,తెలుగు), 20న 6,7 తరగతులకు సామాన్యశాస్త్రం, 8, 9 తరగతులకు తృతీయ భాష (ఇంగ్లిష్) పరీక్షలు నిర్వహించాలని వారు హెచ్‌ఎంలను ఆదేశించారు.

పరీక్షల సమయం ఇలా..

1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు ఆయాతేదీల్లో ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6, 7, 8 తరగతులకు ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12–15 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 9వతరగతికి ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే 8వ తరగతి జీవశాస్త్రం మాత్రం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.45 గంటలవరకు నిర్వహిస్తారు. అలాగే 9వ తరగతి భౌతికశాస్త్రం పేపర్ 1 ఉదయం 9–30 నుంచి 11 గంటల వరకు, పేపర్–2 జీవశాస్త్రం ఉదయం 11–20గంటల నుంచి మధ్యాహ్నం 12–50 గంటల వరకు నిర్వహిస్తారు.

మండల కేంద్రాల్లోని ఎంఆర్‌సీలో ప్రశ్నపత్రాలు

అన్ని మండల కేంద్రాల్లోని ఎంఆర్‌సీ ఎంఈఓల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాల బండిల్స్‌ను పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యను బట్టి బండిల్స్‌ను అందుబాటులో ఉంచారు. 1 నుంచి 9వ తరగతి వరకు ప్రశ్నపత్రాలను ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. 6 నుంచి 9వ తరగతి వరకు మాత్రమే ప్రశ్నపత్రాలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. అయితే ప్రైవేటు పాఠశాలల యాజ మన్యాలు ఏ రోజుకు సంబంధించిన సబ్జెక్టుల ప్రశ్నపత్రాలు అదే రోజు ఉదయం తీసుకెళ్లాల్సి ఉంటుంది. హనుమకొండలో నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ (కీ సెంటర్లుగా) ప్రశ్నపత్రాలను భద్రపర్చామని, నగరంలోని ప్రైవేటు యజ మాన్యాలు అక్కడి నుంచే తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఏమైనా సందేహాలుంటే డీసీఈబీ సెక్రటరీని సంప్రదించాలన్నారు. ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించాలి. 21న జవాబుపత్రాల మూల్యాంకనం ఫలితాలను వెల్లడించాల్సి ఉంటుంది. ఫలితాలను క్యూములేటివ్ రికార్డులో నమోదు చేయాలి. 24న పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి విద్యార్థుల పురోగతి క్యూములేటివ్ రికార్డులను అందించి వాటిపై తల్లిదండ్రుల సంతకం చేయించి తరగతి ఉపాధ్యాయులకు అప్పగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల సంఖ్య ఇలా

జిల్లా	1-5	6-9
హనుమకొండ	27,638	46, 204
వరంగల్	22,466	43,100
మహబూబాబాద్	46,342	41,197
జేఎస్ భూపాలపల్లి	16,299	24,775
ములుగు	11,176	27,778

ఇంజక్షన్ వికటించి విద్యార్థి మృతి

- మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన


మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు

హసన్‌పర్తి: ఇంజక్షన్ ఓ విద్యార్థి ప్రాణం తీసింది. కడుపునొప్పితో బాధపడుతున్న విద్యార్థికి ఒకేసారి మూడు ఇంజక్షన్లు ఇవ్వడంతో అది వికటించి మృతి చెందినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సదరు వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదులో పేర్కొన్నారు. హసన్‌పర్తికి చెందిన మీసరకొండ ప్రియా–సత్యంకు కూతురు, కుమారుడు అవినాష్(11) ఉన్నారు. మామునూర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో అవినాష్ 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఔటింగ్ ఉండడంతో సత్యం పాఠశాలకు వెళ్లాడు. అక్కడ కుమారుడితో కొంతసేపు కాలక్షేపం చేశాడు. మధ్యాహ్నం అవినాష్‌ను పాఠశాలలో వదిలి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇదిలా ఉండగా, సాయంత్రం అవినాష్ కడుపునొప్పితో బాధపడుతున్నట్లు పాఠశాల నుంచి తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. దీంతో సత్యం హుటాహుటిన అక్కడికి చేరుకున్నాడు. కుమారుడిని తీసుకుని ఇంటికి వచ్చాడు. అనంతరం హసన్‌పర్తిలోని డాక్టర్ శంకర్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. పరీక్షలు నిర్వహించిన డాక్టర్ మూడు ఇంజక్షన్లు ఇచ్చినట్లు సత్యం చెప్పాడు. ఒకేసారి పరిస్థితి విషమించడంతో ఎంజీఎంకు రెఫర్ చేశాడు. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే అవినాష్ మృతి చెందాడు.

మృతదేహంతో ధర్నా, రాస్తారోకో...

ఇంజక్షన్ వికటించడం వల్ల అవినాష్ మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. తొలుత ఆస్పత్రి ఎదుట మృతదేహంతో గంటపాటు ధర్నా చేశారు. అనంతరం హన్మకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మృతికి కారకుడైన వైద్యుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆందోళనకారులను శాంతిపజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు డాక్టర్ శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రావుల నరేందర్ తెలిపారు.

నా కొడుకును చంపారు..

కడుపునొప్పి కోసం ఆస్పత్రికి తీసుకెళ్తే నా కుమారుడు అవినాష్‌ను డాక్టర్ సముద్రాల శంకర్ చంపాడని మృతుడి తండ్రి సత్యం ఆరోపించాడు. తమకు నాయం చేయాలని కోరారు.

– సత్యం, మృతుడి తండ్రి

ఆనందంగా గడిపాడు

మీసరకొండ అవినాష్ తెలివి గల విద్యార్థి. ఆదివారం ఔటింగ్‌ను పురస్కరించుకుని తన పేరెంట్స్‌తో ఆనందంగా గడిపాడు. పేరెంట్స్ బిర్యానీ తీసుకొచ్చి తినిపించారు. పేరెంట్స్ వెళ్లిన గంటకే అనారోగ్యానికి గురయ్యాడు. తల్లిదండ్రులకు సమాచారం ఇస్తే వారు తీసుకెళ్లారని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తెలిపారు.

– లక్ష్మయ్య, స్పెషల్ ఆఫీసర్

రైస్‌మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన బియ్యం నిల్వలు
- రూ.10 లక్షల మేర ఆస్తినష్టం


మంటలను అదుపులోకి తెస్తున్న ఫైర్ సిబ్బంది

ఖిలావరంగల్ : వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని రామ్‌లక్ష్మణ్ గార్డెన్స్ ఎదురుగా ఓం నమో భగవతే వాసు దేవాయే విశ్వేశ్వర రైస్‌మిల్లులో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ధాన్యం, బియ్యం నిల్వలు కాలి బూడిదయ్యాయి. సకాలంలో వరంగల్, గొర్రెకుంట, హనుమకొండకు చెందిన మూడు ఫైర్‌ఇంజన్లు రాకతో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఫైర్ అధికారులు, సిబ్బంది శ్రమించడంతో మంటలు పూర్తి స్థాయిలో అదుపులోకి వచ్చాయి. సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. ఘటన స్థలానికి మండల రెవెన్యూ, ఫైర్ అధికారులు, ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రైస్‌మిల్లు యజమాని ఇరుకుల రమేష్ నుంచి ఘటనకు గల కారణాలను సేకరించే ప్రయత్నం చేశారు.

‘చీకటి’ వ్యాపారంపై కలెక్టర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరం కేంద్రంగా సాగుతున్న మొరం దందాపై హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘చీకటి వ్యాపారం’ అనే కథనం ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైంది. ఈ విషయమై కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీరియస్‌గా పరిగణించినట్లు తెలిసింది. ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ నుంచి ఎన్నాళ్ల నుంచి మొరం దందా సాగుతోందంటూ నీటి పారుదల, రెవెన్యూ, పో లీస్‌శాఖలు ఏమైనా కేసులు నమోదు చేశారా? అని ఆరా తీస్తున్నట్లు సమాచారం.విలువైన భూములను తోడుతుంటే ఏం చేస్తున్నారని ఆరా తీసినట్లు తెలిసింది.

బోరు వేయించి సాగు నీరందించాలి

- ప్రజావాణిలో పేదల వినతి
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: హనుకొండ జిల్లా వేలేరు మండలం కన్నారంలో తాము సాగు చేస్తున్న భూమిలో బోరు వేయించాలని ఆగ్రామ పేదలు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో కన్నారం గ్రామ పేదలు కలెక్టర్‌ను కలిశారు. 211 ఎకరాల భూమిని 200 మంది పేద రైతులంతా సాగు చేసుకుంటున్న ఈభూమి పంచ రాయి భూమి అని, తమకు హక్కులు కల్పించాలని గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పట్టాలిచ్చి, బోరు బావి తవ్వించి, విద్యుత్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమస్యను పరిష్కరించాలని అధికారును ఆదేశించారు. ప్రజావాణికి 79 వినతిపత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ కార్పొరేషన్‌కు 9, కలెక్టరేట్‌కు 10 వినతిపత్రాలు, ల్యాండ్ సర్వే శాఖకు 4, సివిల్ సప్‌లై శాఖకు 3 వినతిపత్రాలు రాగా.. ఇతర శాఖలకు ఒకటి, రెండు చొప్పున వచ్చాయి. ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి వాసుచంద్ర, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సాంబశివరావు, డీపీఓ జగదీశ్వర్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ శ్రీను, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు, బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి రాంరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, మైనింగ్ ఏ.డి.నర్సిరెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ.కిరణ్‌ప్రకాశ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా ప్రజావాణి రద్దు..

వరంగల్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పదో తరగతి పరీక్షల తనిఖీ విధుల్లో జిల్లా అధికారులను నియమించడంతో ప్రజావాణి రద్దు చేయాల్సి వచ్చిందని ఏఓ శ్రీకాంత్ వారి చెప్పారు. అయినా ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అప్పటికప్పుడు కలెక్టరేట్‌లోని ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ మహబూబ్ అలీ, ఏఓ శ్రీకాంత్ చాంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి పంపించారు.

వరంగల్‌లో దళిత బహుజన ఫ్రంట్ మహాసభలు

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

హన్మకొండ : దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర 4వ మహాసభలను జూన్ 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు వరంగల్‌లో నిర్వహించనున్నట్లు ఆ ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర మహాసభల సన్నహక సమావేశం జరిగింది. సమావేశంలో శంకర్ మాట్లాడుతూ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు పులి కల్పన, మన్నే బాబురావు, పుట్ట రవి, పోరిక ఈశ్వర్ సింగ్, సందీప్, రవిప్రసాద్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, బాబు, నర్సింగరావు, అశోక్, జగన్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి

- డీఎంహెచ్‌ఓ వెంకటరమణ


అద్దాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

కాశిబుగ్గ: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకుని చూపు సమస్యలను తొలగించుకోవాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. 20వ డివిజన్ కాశిబుగ్గ పద్మనగర్ పద్మశాలి భవన్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశిబుగ్గ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇప్పటి వరకు 10,500 మందికి కంటి పరీక్షలు చేశామన్నారు. వారిలో 2,500 మందికి రీడింగ్ గ్లాసెస్, 1,600 మందికి దూరపు చూపు అద్దాలను ఆర్డర్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట వైద్యులు కిరణ్, గుండా రవీందర్, సిబ్బంది మానస, మోహన్, సౌమ్య, గీత, శ్వేత తదితరులు ఉన్నారు.

టెన్త్ హిందీ పేపర్ బయటికి వచ్చిన ఘటనలో..

- మరో నిందితుడు అరెస్ట్

కమలాపూర్: కమలాపూర్‌లో టెన్త్ హిందీ పేపర్ బయటికి వచ్చిన ఘటనలో మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ సోమవారం తెలిపారు. ఈ నెల 4న కమలాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ పేపర్ బయటికి వచ్చిన ఘటనలో ఇప్పటి వరకు బాలుడిని జువైనల్‌హోంకు, నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా ఈ కేసులో ఏ–10గా ఉన్న కమలాపూర్ మండలం దేశరాజుపల్లికి చెందిన పోతనబోయిన వర్షిత్ అలియాస్ చందును అరెస్ట్ చేశారు. వర్షిత్ తనకు వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన హిందీ ప్రశ్నపత్రాన్ని మరొకరిని సర్క్యులేట్ చేశాడని, ఇన్ని రోజులు పరారీలో ఉన్న వర్షిత్‌ను సోమవారం కమలాపూర్‌లోని గూడూరు క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

70 ట్రాక్టర్ల ఇసుక సీజ్

ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెం గోదావరి నదిలో అక్రమంగా తరలించి డంప్‌చేసిన 70 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సంజీవ తెలిపారు. సోమవారం రామన్నగూడెం కరకట్ట వద్ద అక్రమంగా డంప్ చేసిన ఇసుకను ఆయన పరిశీలించారు. గోదావరిలో ఇసుక అనుమతి లేకుండా పోయడంతో దాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామన్నారు. కాంట్రాక్టర్ చిప్ప అశోక్ ఇసుకకు ఏదైనా ప్ర భుత్వ రుసుము చెల్లించినట్లు చూపితే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని లేకుంటే బహిరంగ వేలం వేస్తామని తెలిపారు. పీఆర్ డీఈఈ, రెవెన్యూ నుంచి ఎలాంటి అనుమతి పొందలేదు. అంతేకాకుండా రాంనగర్ గోదావరి నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


యాత్రలో అభివాదం చేస్తున్న రాజేందర్‌రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి
- ‘పశ్చిమ’లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర

హన్మకొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆపార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి హనుమకొండలోని 49వ డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నాయిని రాజేందర్‌రెడ్డి చేపట్టారు. సుబేదారి ఫారెస్ట్ ఆఫీస్ క్రాస్‌రోడ్డు నుంచి ప్రారంభమైన పాదయాత్ర రెవెన్యూ కాలనీ, ప్రగతినగర్–1, ప్రగతినగర్–2, నాగేంద్ర కాలనీ మీదుగా జూలైవాడ వరకు సాగింది. యాత్రలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలను కలుస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం రోజున రాష్ట్రంలో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగిస్తే కేసీఆర్ ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల అప్పుల పాలు చేసిందని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉత్సవ విగ్రహాల్లా మారారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు దొమ్మటి సాంబయ్య, పెరుమాండ్ల రామకృష్ణ, బంక సరళ, తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాగపురి దయాకర్, కూర వెంకట్, బంక సంపత్‌యాదవ్, ఇ.మధుకర్‌రెడ్డి, కె.మల్లారెడ్డి, బండారి జనార్దన్ రెడ్డి, మహమ్మద్ బషీర్, డి.తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగపురి కరణ్, రాజేశ్, శ్యాం, సృజన్, గణేశ్, రవీందర్‌రెడ్డి, అరుణ్ రెడ్డి, ఫయాజ్, భూక్య అనిల్, హుస్సేన్ బి, శేషు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో ష్యూరిటీ పత్రాలు తయారు

- నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ కరుణాకర్

వరంగల్ క్రైం : ఫోర్జరీ సంతకాలతో ష్యూరిటీ పత్రాలను తయారు చేసి వివిధ న్యాయస్థానాల్లో నిందితులు బెయిల్‌పై రావటానికి సహకరిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ తెలిపారు. కోర్టుల్లో బెయిల్, పూచీకత్తు కోసం కావల్సిన పత్రాలను ఫోర్జరీ చేస్తున్న ముగ్గురిని పర్వతగిరి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు డీసీపీ తెలిపారు. నిందితులు ఐనవోలు మండలం పంథిని గ్రామానికి చెందిన ఉడతల రవీందర్, సంగెం మండలం సోమ్లతండాకు చెందిన బానోతు వెంకన్న, బానోతు నరసింహుల నుంచి వివిధ జీపీలకు చెందిన స్టాంపులు, ఆధార్‌కార్డులు మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు రవీందర్ వివిధ కేసుల్లో జైల్లో ఉన్నవారికి బెయిల్ ఇచ్చేందుకు అవసరమైన పత్రాలు, ఇచ్చేందుకు సంగెం మండలంలోని సోమ్లాతండా, పర్వతగిరి మండలంలోని ముడెత్తల తండా, ఏనుగల్, చౌటపల్లి గ్రామాల్లో సుమారు మందికి పైగా సంప్రదించేవాడని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ విభాగానికి చెందిన రెండు రౌండ్ రబ్బర్ స్టాంపులు పంచాయతీ కార్యదర్శి పేరుమీదుగా హైదరాబాద్‌లో తయారు చేయించి, ఇంటిపన్నుకు సంబంధించిన పత్రాలను సృష్టించి, పూచీకత్తు పడే వ్యక్తులను న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చేవాడని తెలిపారు. సోమవారం పర్వతగిరి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఏనుగల్లు ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు రవీందర్ దగ్గర పంచాయతీ కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన స్టాంపులు, ఇంటిపన్ను రశీదులు అనధికారికంగా దొరకడంతో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు డీసీపీ తెలిపారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ఇద్దరి వివరాలను చెప్పడంతో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో 48 మందిని ష్యూరిటీదారులు గుర్తించినట్లు తెలిపారు. వీరు 29 కోర్టుల్లో 691 కేసుల్లో ష్యూరిటీ వ్యవహరించినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కొమ్మురి శ్రీనివాస్‌రావు, పర్వతగిరి ఎస్సై దేవేందర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు లవన్‌కుమార్, ఏఏవో సల్మాన్‌పాషా, హెడ్ కానిస్టేబుల్ అశోక్, స్వర్ణలత, కానిస్టేబుళ్లు శ్రవన్‌కుమార్, నాగరాజు, సురేష్, కరుణాకర్, రాజేందర్, శ్యామ్, ప్రభాకర్, దయాసాగర్, మహబుబ్‌పాషాలను డీసీపీ అభినందించారు.